అంగన్‌వాడీ పోస్టుల భర్తీపై కసరత్తు

- సర్కారు ఆదేశాలతో ఖాళీలపై సమాచారం కోరిన ఉన్నతాధికారులు
- గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లో 331 టీచర్, ఆయా పోస్టుల ఖాళీలు
- మూడేళ్లుగా ఎదురుచూస్తున్న వారిలో చిగురించిన ఆశలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఖాళీ పోస్టుల భర్తీపై ఆశలు చిగురించాయి. ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడంతో అంగన్‌వాడీల్లో కేంద్రాల్లో టీచర్, హెల్పర్ పోస్టుల కోసం దరఖాస్తు పెట్టుకుని మూడేళ్లుగా ఎదురుచూస్తున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీ ప్రక్రియపై కొత్త ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదలైన వెంటనే గ్రేటర్‌తో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ఆయా జిల్లాల్లోని ఖాళీ పోస్టుల సమాచారాన్ని కోరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా గుర్తించిన సంబంధిత అధికారులు నివేదికలను ఉన్నతాధికారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మూడేళ్లుగా ఖాళీలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్ల తరబడి టీచర్, హెల్పర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల ఆశించిన ఫలాలు నెరవేరడం లేదు. పోస్టుల భర్తీపై మండలాలు, ప్రాజెక్టు కమిటీలు భర్తీపై పలు తీర్మానాలు చేసి పంపించినా కాగితాల్లో కదలిక మాత్రం కనిపించడం లేదు. ఉద్యోగ పోస్టులపై కొత్త ప్రభుత్వం నిర్ణయం నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు మహార్దశ రానుంది.

విధుల నిర్వహణలోనూ కీలకం

అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య, ఆరోగ్య రక్షణ చర్యలతో పాటు గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యానికి ఆరోగ్యలక్ష్మి పథకం అమలు వంటి విధుల నిర్వహణలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కీలక భూమిక పోషిస్తున్నారు. ఒకటి నుంచి ఆరు సంవత్సరాలలోపు పిల్లలు అంగన్‌వాడీ సెంటర్లకు వస్తారు. అంగన్‌వాడీ టీచర్, ఆయాలు(హెల్పర్లు) కలిసి పిల్లలను ఇళ్ల వద్ద నుంచి తీసుకురావడం, పసిపిల్లలు కావడంతో ఇంటి వద్ద మారం చేస్తే.. వారిని బుజ్జగించడం వంటి విధులు నిర్వహిస్తారు. పిల్లల చేతులు కడగటం, ఉడికించిన కోడిగుడ్లు ఇవ్వడం, అవి తిన్న తర్వాత వండిన పౌష్టికాహారం పెట్టడం వంటి విధులు నిర్వర్తిస్తారు. పసి పిల్లలు కావడం వల్ల టాయ్‌లెట్ విషయంలో హెల్పర్లు చాలా జాగ్రత్తలు తీసుకుంటారు.

3,307 కేంద్రాల్లో లబ్ధిదారుల సంఖ్య 3.43 లక్షలు

గ్రేటర్‌తోసహా శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 3,307 ఉన్నాయి. వీటి పరిధిలో ఆరు సంవత్సరాల లోపు చిన్నారులతో సహా గర్భిణులు, బాలింతలు మొత్తంగా 3,43,694 మంది ఉన్నారు.

- గ్రేటర్‌తోసహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులు ఈ విధంగా ఉన్నాయి. హైదరాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం పోస్టులు 167 ఖాళీగా ఉండగా, ఇందులో టీచర్ పోస్టులు 42, హెల్పర్లు 125 ఖాళీగా ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 124 పోస్టులు ఖాళీగా ఉండగా, ఇందులో 21 టీచర్లు, 103 హెల్పర్ పోస్టులు ఉన్నాయి. అలాగే, రంగారెడ్డి జిల్లాలో 40 పోస్టులు ఖాళీగా ఉండగా, ఇందులో టీచర్ పోస్టులు 8, హెల్పర్ పోస్టులు 32 ఖాళీగా ఉన్నాయి.

జిల్లాలవారీగా అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల సంఖ్య, ఖాళీల వివరాలు..

జిల్లా	అంగన్‌వాడీ సెంటర్లు	లబ్ధిదారుల సంఖ్య	ఖాళీ పోస్టులు
హైదరాబాద్	914	1,19,800	167
మేడ్చల్	793	95,017	124
రంగారెడ్డి	1600	1,28,797	40
మొత్తం	3,307	3,43,694	331

జీహెచ్‌ఎంసీ అధికారులపై ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్: సమాచార హక్కు చట్టం ద్వారా తాను అడిగిన సమాచారానికి సమాధానం ఇవ్వకుండా ఆ సమాచారాన్ని ఇతరులకు అందించి హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని జన తెలంగాణ రైట్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు వడ్డెం శ్యాం రాంగోపాల్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహించే జోనల్ సిటీ ప్లానర్ ప్రదీప్, సికింద్రాబాద్ సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రజితలు ఇచ్చిన ఓ అనుమతులపై తమ సంస్థ సమాచార హక్కు చట్టం ద్వారా తాము వివరాలు కోరినట్లు ఆయన ఫిర్యాదులో తెలిపారు. కొంత మంది అవినీతి అధికారులు నిబంధనలు పూర్తిగా అతిక్రమించి ఇచ్చిన అనుమతులపై తాను ఆర్టీఐ చట్టం ద్వారా వివరాలు సేకరించేందుకు యత్నిస్తే అదే ఫైల్‌కు సంబంధించిన వ్యక్తులకు దరఖాస్తు చేసిన తమ వివరాలు, ఫోన్ నంబర్లు అందించారని తెలిపారు. ఇలా చేయడంతో దరఖాస్తుదారుల ప్రాణాలకు రక్షణ ఉండదని, సమాచార హక్కు చట్టంలో ఇదే నిబంధన ఉందని అధికారుల నిర్వాహకంతో తమ సంస్థకు చెందిన వ్యక్తుల ప్రాణాలకు అపాయం పొంచి ఉందని అందులో తెలిపారు. ఇలా గోప్యంగా ఉంచాల్సిన సమాచారాన్ని ఇతరులకు అందించిన అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



మేడ్చల్: న్యూఇయర్ వేడుకలను మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. గ్రామాలు, కాలనీల్లో స్నేహితులతో కలిసి పార్టీలు జరుపుకుని వేడుకల్లో పాల్గొన్నారు. ఇళ్ల వద్ద మహిళలు అందమైన ముగ్గులు వేసి 2024 స్వాగతం పలికారు. ఉదయం ఆలయాలకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. భక్తుల తాకిడితో ఆలయాలు కిటకిటలాడాయి. ఎక్కడ చూసినా న్యూ ఇయర్ వాతావరణం కనిపించింది.

కేటీఆర్‌ను మల్లారెడ్డి



నూతన సంవత్సరం సందర్భంగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. కేటీఆర్ నివాసానికి వెళ్లి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల చైర్‌పర్సన్లు దీపికనర్సింహరెడ్డి, లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇళ్లకు వెళ్లి న్యూయర్ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి నివాసాలకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

పోచారంలో నూతన సంవత్సర వేడుకలు



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని పలు దేవాలయాలు, చర్చిలు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భక్తులతో పోటెత్తాయి. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని పోచారం నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బీఆర్‌ఎస్ పోచారం మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలేష్, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అక్రం అలీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన మేయర్ కావ్య



జవహర్‌నగర్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో జవహర్‌నగర్ మేయర్ కావ్య, కార్పొరేటర్లు మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తూంకుంట మున్సిపాలిటీలో..



శామీర్‌పేట్: నూతన సంవత్సర వేడుకలను తూంకుంట మున్సిపాలిటీతో పాటు ఉమ్మడి శామీర్‌పేట మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. యువతీ, యువకులు తమ స్నేహితులతో ఒక చోట చేరి కేక్ కట్ చేసి నూతన సంవత్సరాన్ని స్వాగతించి వేడుకలు జరుపుకున్నారు. సోమవారం ఉదయం మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి.

జెడ్పీ చైర్మన్‌కు ఆశీర్వచనాలు



ఘట్‌కేసర్: కీసరగుట్ట ఆలయ అర్చకులు జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఆశీర్వచనాలు అందజేశారు.

శ్రీరంగనాయక్ స్వామి ఆలయంలో..



ఘట్‌కేసర్: ఎదులాబాద్ శ్రీగోదాదేవి రంగనాయక స్వామి ఆలయంలో మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, ప్రీతిరెడ్డి దంపతులతో పాటు స్థానికులు స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అయ్యప్ప ఆలయంలో లక్ష దీపార్చన



మేడ్చల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ఆలయ అర్చక గురుస్వామి క్రిష్ణమూర్తి ప్రత్యేక పూజలు చేసి లక్ష దీపార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించి పడి పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో లక్ష దీపాలను ఏర్పాటు చేసి వెలిగించారు. వివిధ రూపాల్లో దీపాలను అలంకరించి లక్ష దీపార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ రవిప్రసాద్

పోచారం: అన్నానగర్‌లోని అమ్మానాన్న అనాథాశ్రమంలో ఏర్పాటు చేసిన భోజనశాలను రిటైర్డ్ ప్రొఫెసర్ డీఎం రవిప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధులను భారంగా భావించకుండా బాధ్యతగా ఆదరించాలన్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి వృద్ధులకు తినిపించారు. కార్యక్రమంలో ఆశ్రమ చైర్మన్ గగనం నారాయణ, నిర్వాహకులు కడమంచి రాంబాబు, ఎం.నర్సయ్య, ఆర్.జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ 21వ డివిజన్ అధ్యక్షుడిగా గణేష్



గణేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ 21వ డివిజన్ నూతన కమిటీని సోమవారం కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కడారి గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చిన్నం బాల్‌నర్సింహ, నగేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రామ్‌నర్సయ్య, బీసీసెల్ అధ్యక్షుడిగా కృష్ణ, కమిటీ సభ్యులుగా రాజమౌళి, ప్రభాకర్, సాంబయ్య, బషీర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సింగం బాలరాజు, సిద్దులుయాదవ్, పాల్, కృష్ణ, రమేష్, ఓబుల్‌రెడ్డి, ప్రకాష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రెడ్డికి ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు



బోడుప్పల్: ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు వచ్చింది. నగరంలో తెలంగాణ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (టీఐఎఫ్‌ఎఫ్) 2023లో కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అనంతరం బోడుప్పల్‌లో ఆయన మాట్లాడుతూ గ్రీన్ పాంథర్ షార్ట్ ఫిలిం ద్వారా పర్యావరణంపై రూపొందించిన సందేశాత్మక డాక్యుమెంటరీకి ఈ అవార్డు వచ్చిందన్నారు. సతమతమయ్యే మానవాళిని కాపాడుకునేందుకు తగిన పరిష్కార మార్గాలను చూపుతూ తనవంతు కృషి చేస్తానన్నారు. భూమాతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్న చిన్న షార్ట్ ఫిలిమ్స్‌ను ప్రభుత్వం ప్రోత్సహించి సహకారాన్ని అందించాలని ఆయన కోరారు.

ఆలయాలకు నూతన శోభ



కీసరగుట్టలో భక్తుల రద్దీ



చీర్యాల దేవాలయం వద్ద క్యూలో భక్తులు



చీర్యాలలో ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ

కీసర: కొత్త ఏడాది మొదటి రోజు, శివుడికి ఇష్టమైన సోమవారం రోజు కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆంజనేయ స్వామి దేవాలయం పరిసర ప్రాంతాల్లోని శివలింగాలకు పాలు, కుంకుమ, పసుపు, గంధం, పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుటుంబసమేతంగా కొద్దిసేపు పార్కులో సేద తీరారు.

భక్తులతో కిటకిటలాడిన చీర్యాల దేవాలయం..

చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్ ఆలయ సిబ్బంది భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేయించారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డికి స్వామివారి ఆశీర్వచనం



ఎమ్మెల్యే మల్లారెడ్డికి కీసరగుట్ట స్వామివారి ఆశీర్వచనం అందజేస్తున్న కీసరగుట్ట వేదపండితులు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కీసరగుట్ట దేవాలయ వేదపండితులు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి కీసరగుట్ట స్వామివారి ఆశీర్వచనం అందజేశారు. నగరంలోని మల్లారెడ్డి నివాసానికి వెళ్లిన కీసరగుట్ట వేదపండితులు కీసరగుట్ట స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు.

విద్యార్థి దశ నుంచే టెక్నాలజీ నేర్చుకోవాలి



బోడుప్పల్: విద్యార్థి దశ నుంచే టెక్నాలజీ నేర్చుకొని ఆ దిశగా విద్యార్థులు అడుగులు వేయాలని సీసీఎంబీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌జీ పల్లెల అన్నారు. బోడుప్పల్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో 'ఫ్యూజన్ ఫియస్టా' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ అనేది విద్యార్థులలో పాఠశాల స్థాయిలో నేర్చుకోవాలని, వివిధ శాఖల్లో సరికొత్త ప్రయోగాత్మక పరికరాలను అందరికీ ఉపయోగపడేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ విధంగా ప్రోత్సహిస్తే విద్యార్థులు అద్భుతాలు చేసి నిరూపిస్తారన్నారు. విద్యార్థులు తయారు చేసిన పలు నమూనాలను ఆయన తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల రీజనల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నళిని జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షింతల శోభాయాత్ర



మేడ్చల్: అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన పూజిత అక్షింతల శోభాయాత్రను మేడ్చల్ మున్సిపాలిటీ, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధితో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించి అన్ని వీధుల్లో ఊరేగించారు. పెద్దఎత్తున మహిళలు హాజరై హారతులు పట్టారు. పార్టీల నాయకులు, ప్రముఖులు ఊరేగింపులో పాల్గొన్నారు. సీతా, రాముడు, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

శివారుల్లో ఉపాధి ప్రణాళికపై కసరత్తు



సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో (మేటీరియల్ కాంపౌండ్‌తో కలిపి) అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) కసరత్తు చేస్తోంది. వచ్చే ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు ఉపాధి కూలీలు చేపట్టనున్న పనులకు సంబంధించిన కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించారు. అందులో భాగంగా 21,586 మంది కూలీలకు 1.71 లక్షల పనిదినాల్లో రూ.5.30 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులు చేపట్టాలన్న లక్ష్యాన్ని అధిగమించాలని యోచిస్తోంది. కూలీలకు వంద రోజులు పని కల్పించడం ద్వారా పేదల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఐదు మండలాల పరిధిలోని 61 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరిగేలా డీఆర్డీఏ కార్యక్రమాన్ని రూపొందిస్తోంది.

గతేడాది పనులిలా..

జిల్లా మేడ్చల్–మల్కాజిగిరిలో ఘట్‌కేసర్, కీసర, మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలో మొత్తం జాబ్ కార్డులు 19,350 ఉండగా, ఇందులో ఎస్టీ జాబ్ కార్డులు 1500, ఇతర కులాల వారి జాబ్‌కార్డులు 13,610 ఉన్నాయి. ఈ జాబ్ కార్డులకు సంబంధించి కూలీల సంఖ్య 21,586 మంది ఉన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ఐదు మండలాల పరిధిలోని 17,699 జాబ్ కార్డులకు సంబంధించి 2,369 మంది కూలీలకు 37,631 పనిదినాలను కల్పించడం ద్వారా సామాగ్రితో కలిపి పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనుల విలువ దాదాపు రూ.కోటి ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రతిరోజూ 127 నుంచి 282 మంది కూలీలు ఉపాధి పనుల్లో పని చేస్తున్నారు. చెరువు పూడికతీత పనులతో పాటు కందకాలు తవ్వడం, ఫీడర్ కాలువల నిర్మాణం, హరితహారం పనుల్లో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం వంటి పనులను ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేపట్టారు.

ఉపాధి హామీ పథకంలో గుర్తించిన పనులివే..

ఉపాధి హామీ పథకంలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనుల గుర్తింపు ప్రక్రియను అధికార యంత్రాంగం ప్రారంభించింది. ఊట కుంటలు, కందకాలు తవ్వడం, ప్రభుత్వ స్థలంలో మొక్కలు పెంచడం, పల్లె ప్రకృతి వనాలు, రైతు కల్లాలు, ఇంకుడు గుంతలు, ప్రభుత్వ స్థలంలో నేలను చదును చేయడం, ఎండిపోయిన బోరుబావుల రీచార్జి, వైకుంఠ ధామాలు, ప్రభుత్వ సంస్థలకు రోడ్లు వేయడం, డంపింగ్ యార్డులు, కామన్ ల్యాండ్ సోక్ పిట్స్, కొత్తగా నిర్మించిన రహదారులపై గ్రావెల్ వేయడం, కంపోస్ట్ ఎరువుల గుంతలు, ఫీడర్ కాల్వలు వంటి పనులను కూలీలు చేపట్టేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అలాగే పశువులు, గొర్రెలు, మేకల తొట్ల నిర్మాణం, పండ్ల తోటల నిర్మాణం, తాటి వనాలు పెంచడం, చేపల కుంటలు, మిషన్ భగీరథ కోసం కందకాలు, మైనర్ ఇరిగేషన్ కాల్వల్లో పూడిక తీయడం, హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం వంటి ఉపాధి పనులు కూడా కూలీలు చేపట్టవచ్చని పేర్కొంది.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో క్యూ

కాప్రా: 2023 ఏడాదికి గుడ్‌బై చెప్పి.. నూతన ఆశయాలతో 2024కు స్వాగతం చెప్పారు సర్కిల్ ప్రజలు. న్యూఇయర్ సందర్భంగా ఈ ఏడాదిలో తాము అనుకున్న లక్ష్యాలు నెరవేరాలని కోరుకుంటూ తెల్లవారుజాము నుంచే ప్రజలు ఆలయాలకు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుషాయిగూడ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి ఉదయం నుంచే పోటెత్తారు.

ముఖ్యమంత్రిని కలిసిన తరుణ్‌గౌడ్



బోడుప్పల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం తరుణ్‌గౌడ్ సచివాలయంలో కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసిన తరుణ్‌గౌడ్ ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నిద్రలోనే మహిళ మృతి

ఉప్పల్: ఓ గృహిణి నిద్రలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామంతాపూర్ అరవింద్‌నగర్ కాలనీకి చెందిన తాపీ మేస్త్రీ శ్రీనివాస్ భార్య పద్మ(46) ఆదివారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. సోమవారం ఉదయాన్నే శ్రీనివాస్‌ను పద్మ నిద్రలేపి పనికి పంపించింది. అనంతరం తాను పడుకుంది. పనిలేక శ్రీనివాస్ ఇంటికి వచ్చి పద్మను లేపగా మృతి చెంది ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.